'పాలమూరు' ద్వారా 90 టిఎంసిలకు అనుమతిస్తే సరేసరి...
లేకుంటే జూరాల నుంచే 70 టిఎంసిలు తరలిస్తాం!

- జగన్, చంద్రబాబు, మోడీ ఎవరొస్తరో చూస్తా...
- చంద్రబాబు, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాయలసీమ ఎత్తిపోతల పనులు ఆపించా
- తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా 90 టిఎంసిల కృష్ణా జలాలను తరలించేందుకు అనుమతిస్తే సరేసరి... లేకుంటే జూరాల నుంచి 70 టిఎంసిల నీటిని పాలమూరు రంగారెడ్డి, నల్గొండకు తీసుకెళతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జగన్, చంద్రబాబు, మోడీ... ఎవరొస్తారో చూస్తా అని అన్నారు. నీళ్లు, నిధులు, అభివృద్ధి విషయంలో నాతో సహా మంత్రులందరం ఏకాభిప్రాయంతో ఉన్నామని తెలిపారు. 'దేవుడి మీద ఆన... ఎవరికీ తలవంచం. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించం' అని సిఎం రేవంత్ ఉద్వేగభరితంగా మాట్లాడారు. నీళ్లు - నిజాలు అంశంపై శనివారం తెలంగాణ అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి మాట్లాడారు. 'కెసిఆర్‌తో వైఎస్ జగన్ దోస్తానా చేసి రాయలసీమ ఎత్తిపోతల నుంచి రోజుకు మూడు టిఎంసిల కృష్ణా జలాలను తరలించుకునేలా ప్లాన్ చేస్తే... నేను సిఎం అయ్యాక ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రంపై ఒత్తిడి చేసి రాయలసీయ ఎత్తిపోతల పనులు ఆపించా. అవసరమైతే దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేసి తేల్చండి. ఉమ్మడి రాష్ట్రంలో అనుమతులొచ్చిన ప్రాజెక్టుల పనులకు అడ్డపడొద్దు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి చెప్పాను. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు ఉండాలనే అధికారులతో కమిటీలు వేసి చర్చలు జరుపుతున్నాం. తెలంగాణ ప్రజల కోసం టిడిపిని, చంద్రబాబు నాయకత్వాన్ని వదిలి కాంగ్రెస్‌లో చేరా. తెలంగాణ ప్రజలను ఒప్పించి, మెప్పించి ముఖ్యమంత్రి అయిన నేను తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తానా? మొదట నాకు నా ప్రాంతం... తర్వాత పార్టీ, ఆ తర్వాత నాయకుడు. వ్యక్తులను గౌరవిస్తా... హక్కులకు భంగం కలిగిస్తే ఎవరిమీదైనా తిరగబడతా. నా చిత్తశుద్ధి పట్ల ప్రజలకు విశ్వాసం ఉంది. పోరాడినా తెలంగాణ కోసం పోరాడతాం.. చచ్చినా తెలంగాణ కోసం చస్తాం. ఈ మట్టిలోనే కలుస్తాం. మా ప్రభుత్వానికి కమిట్‌మెంట్ అది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ హక్కుల కోసం కొట్లాడిన నేను ఇప్పుడు రాజీ పడతానా? బట్టలూడదీస్తా అన్న వారికి సరిపడా సమాధానం చెప్తా. కానీ, మర్యాద, సభ్యత అడ్డొస్తుంది. మా చిత్తశుద్ధిని ప్రశ్నించే వారి నాలుక కోస్తా' అని రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో, గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలోనే పాలమూరు జిల్లాకు అన్యాయం జరిగిందని విమర్శించారు.

తెలంగాణ అసెంబ్లీలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రతిపక్షనేత కెసిఆర్ రెండేళ్లుగా సభకు రావడం లేదు

సుదీర్ఘ అనుభవమున్న ప్రతిపక్ష నేత కెసిఆర్ సభకు హాజరై సలహాలు, సూచనలు ఇస్తారని అనుకుంటే, రెండేళ్లుగా ఆయన సభకు రావడంలేదని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేత సభలో మాట్లాడకుంటే అంతిమంగా ప్రజలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కృష్ణా జలాలపై చర్చను తెరపైకి తెచ్చిందే కెసిఆర్‌నని తెలిపారు. పార్టీ కార్యాలయాల్లో మాట్లాడితే ప్రజల్లో గందరగోళం నెలకొంటుందనే, కెసిఆర్ మాట్లాడిన వెంటనే అసెంబ్లీలో చర్చకు పెట్టామన్నారు. కానీ, ఆయన సభకు రాలేదు. చట్టసభలంటే కెసిఆర్‌కు చిన్నచూపని సిఎం రేవంత్ విమర్శించారు. గోదావరి-బనకచర్లకు కెసిఆర్ హయాంలోనే పునాది పడిందని, కెసిఆర్ సూచనతోనే చంద్రబాబు బనకచర్ల ఆలోచన చేశారని ఆరోపించారు. కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశాలకు హాజరైన కెసిఆర్... కృష్ణా జలాల్లో ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలకు అంగీకరించారన్నారు. కృష్ణా ట్రిబ్యునల్ తుదితీర్పు వచ్చే వరకు దీనికే కట్టుబడి ఉంటామని కెసిఆర్ సంతకం కూడా చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ఏర్పడింది. దశాబ్దకాలంలో రూ.1.30 లక్షల కోట్ల వ్యయం చేసినా నీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. రీ డిజైన్, రీ-ఎస్టిమేషన్ పేరుతో కాలయాపన చేస్తూ, అవినీతి అక్రమాలకు ప్పాలడుతూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఇప్పుడు ప్రాజెక్టుల నిర్మాణాలపై పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ ప్రజల్ని గందరగోళ పరుస్తున్నారు. వాస్తవంగా గత ప్రభుత్వం ప్రాజెక్టులపై చేసిన ఖర్చు ఎంత? ఎన్ని ఎకరాలకు నీళ్లు అందించింది? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేండ్ల కాలంలో ప్రాజెక్టులపై చేసిన వ్యయం ఎంత? ఎన్ని ప్రాజెక్టులు పూర్తిచేయడానికి పూనుకున్నది? పెండింగ్ ప్రాజెక్టులను ఎప్పటివరకు పూర్తిచేస్తుంది? లక్షల కోట్ల రూపాయలను అప్పులు తెచ్చి ఖర్చు చేస్తున్న క్రమంలో ప్రాజెక్టులపై ప్రజలకు పూర్తివివరాలు తెలియజేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. అందుకే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆల్ ఇండియా జాక్టో ఆవిర్భావం

- టెట్, సిపిఎస్, ఎన్ఇపి తదితర సమస్యలపై జాతీయ స్థాయిలో పోరాటం
- 7న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం
- ఉపాధ్యాయ సంఘాల సంయుక్త ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుంచి మినహాయింపునివ్వాలని, సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనీ, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని తదితర ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఐక్యంగా పోరాడాలని పలు ఉపాధ్యాయ సంఘాలు శనివారం సంయుక్తంగా ప్రకటించాయి. అఖిల భారత ఉపాధ్యాయ సంఘాలు స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ), ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌టిఎఫ్), ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐపిటిఎఫ్), ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్ఇటిఒ)లు నిర్ణయించాయి. ఆ మేరకు ఆయా సంఘాల ప్రతినిధులు ఉమ్మడిగా సమావేశమై అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్) (ఎఐజెఎసిటిఒ)ని ఏర్పాటు చేశారు. ఎఐజాక్టో ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలు నిర్వహించాలని జాక్టో నాయకులు పిలుపునిచ్చారు. ఈ పోరాట కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేసేందుకు ఆ సంఘాలకు అనుబంధంగా తెలంగాణలో ఉన్న టిఎస్‌యుటిఎఫ్, ఎస్‌టియుటిఎస్, పిఆర్‌టియుటిఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆయా సంఘాల రాష్ట్ర నాయకులు చావ రవి, సదానందం వైఎస్ శర్మ, పోల్ రెడ్డి తెలిపారు.

ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా గుర్తింపు

న్యూఢిల్లీ : విద్యుత్ వాహనాల (ఇవి) బ్యాటరీలకు ఆధార్ నంబర్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ విధానం ద్వారా బ్యాటరీలను ప్రారంభం నుంచి తుది వరకు గుర్తించడంతో పాటు సమర్థమైన రీసైక్లింగ్‌ను ప్రోత్సహించవచ్చని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. బ్యాటరీ తయారీదారు లేదా దిగుమతిదారు మార్కెట్‌లోకి తెచ్చే ప్రతి బ్యాటరీ ప్యాక్‌కు 21 అక్షరాల 'బ్యాటరీ ప్యాక్ ఆధార్ నంబర్(బిపిఎఎన్)' తప్పనిసరిగా కేటాయించాలి. ఈ తరహా గుర్తింపుతో బ్యాటరీ పనితీరు, పర్యావరణంపై ప్రభావాన్ని కూడా కచ్చితంగా ట్రాక్ చేయడం కుదురుతుందని తెలిపింది. ఈ నంబర్ బ్యాటరీపై స్పష్టంగా కనిపించేలా, తొలగించడానికి వీల్లేకుండా రూపొందించాలి. ఇది బ్యాటరీ ఎకోసిస్టమ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం, స్థిరత్వం తెస్తుందని రవాణ మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఈ గుర్తింపు సంఖ్య వల్ల నకిలీ బ్యాటరీలను అరికట్టవచ్చని మంత్రిత్వ శాఖ ఆలోచనగా ఉంది.

టెస్లాను అధిగమించిన బివైడి

- ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా గుర్తింపు

న్యూఢిల్లీ : విద్యుత్ వాహనాల (ఇవి) బ్యాటరీలకు ఆధార్ నంబర్ తరహా విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ విధానం ద్వారా బ్యాటరీలను ప్రారంభం నుంచి తుది వరకు గుర్తించడంతో పాటు సమర్థమైన రీసైక్లింగ్‌ను ప్రోత్సహించవచ్చని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. బ్యాటరీ తయారీదారు లేదా దిగుమతిదారు మార్కెట్‌లోకి తెచ్చే ప్రతి బ్యాటరీ ప్యాక్‌కు 21 అక్షరాల 'బ్యాటరీ ప్యాక్ ఆధార్ నంబర్(బిపిఎఎన్)' తప్పనిసరిగా కేటాయించాలి. ఈ తరహా గుర్తింపుతో బ్యాటరీ పనితీరు, పర్యావరణంపై ప్రభావాన్ని కూడా కచ్చితంగా ట్రాక్ చేయడం కుదురుతుందని తెలిపింది. ఈ నంబర్ బ్యాటరీపై స్పష్టంగా కనిపించేలా, తొలగించడానికి వీల్లేకుండా రూపొందించాలి. ఇది బ్యాటరీ ఎకోసిస్టమ్‌లో పారదర్శకత, జవాబుదారీతనం, స్థిరత్వం తెస్తుందని రవాణ మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఈ గుర్తింపు సంఖ్య వల్ల నకిలీ బ్యాటరీలను అరికట్టవచ్చని మంత్రిత్వ శాఖ ఆలోచనగా ఉంది.

జొమాటో సిఇఒ చెప్పింది తప్పు..!

- గిగ్‌వర్కర్ల యూనియన్ల ఆగ్రహం
- గంటకు నికర ఆదాయం రూ.81 మాత్రమే
- డెలివరీ కార్మికులకు సామాజిక భద్రత కరువు

హైదరాబాద్ : గిగ్‌వర్కర్లకు గౌరవమైన వేతనం, ప్రోత్సాహకాలు దక్కుతున్నాయని జొమాటో సిఇఒ దీపిందర్ గోయల్ చెప్పేది తప్పని గిగ్ వర్కర్ల యూనియన్లు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీపిందర్ గోయల్ తన కంపెనీకి చెందిన తాత్కాలిక ఉపాధి విధానం 'గిగ్ మోడల్' ను సమర్థించుకుంటూ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ అసోసియేషన్ (టిజిపిడబ్ల్యుఎ) తప్పుబట్టింది. డెలవరీ కార్మికుల ప్రస్తుత పని పరిస్థితులు ఏమాత్రం గౌరవప్రదంగా లేవని ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో భారతదేశంలో వేగంగా పెరుగుతోన్న క్విక్ కామర్స్, డెలివరీ కార్మికుల ప్రయోజనాలపై దీపిందర్ గోయల్, గిగ్‌వర్కర్ల యూనియన్ల మధ్య జరుగుతున్న చర్చ తీవ్ర వేడెక్కినట్లయ్యింది.

"జొమాటోలో 2025లో డెలివరీ పార్ట్నర్ సగటు వేతనం రూ.102గా ఉంది. 2024లో ఇది రూ.92గా నమోదయ్యింది. డెలివరీ భాగస్వాములు ఒకవేళ రోజుకు 10 గంటలు చొప్పున నెలలో 26 రోజులు పనిచేసినా ఒక్కో డెలివరీ ఏజెంట్ రూ.26,500 ఆర్జించొచ్చు. అందులోంచి పెట్రోల్, నిర్వహణ ఖర్చులు మినహాయించినా రూ.21,000 వస్తుంది. దీనికి టిప్ అదనం. ఫుల్ టైమ్ వర్క్‌కు ప్రత్యామ్నాయంగా గిగ్ వర్క్ మోడల్ రూపుదిద్దుకుంది. ఉద్యోగితో సమానంగా ప్రయోజనాలు, స్థిరమైన వేతనాలు కోరడం ఈ మోడల్‌కు ఏమాత్రం సరిపోదు." అని దీపిందర్ గోయల్ వ్యాఖ్యలు చేశారు.

దీపిందర్‌కు యూనియన్ల కౌంటర్..

దీపిందర్ గోయల్ వ్యాఖ్యలను గిగ్ వర్కర్ల యూనియన్ సవాల్ చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని టిజిపిడబ్ల్యుఎ తెలిపింది. "పెట్రోల్, వాహన నిర్వహణ ఖర్చులను తీసివేస్తే వాస్తవానికి గంటకు నికరంగా రూ.81 మాత్రమే వస్తుంది. దీని ప్రకారం.. నెలకు 26 రోజులు, రోజుకు 10 గంటల చొప్పున కష్టపడి పనిచేసే వ్యక్తికి సుమారు రూ.21,000 మాత్రమే లభిస్తుంది. డెలివరీ భాగస్వాములకు వేతనంతో కూడిన సెలవులు (పెయిడ్ లీవ్స్), సామాజిక భద్రత లేదా గ్యారెంటీ ఉన్న ప్రమాద బీమా లేవు. గోయల్ చెప్పిన అదనపు ఆదాయం చాలా పరిమితం. కేవలం 5 శాతం ఆర్డర్లకు మాత్రమే టిప్స్ వస్తున్నాయి." అని టిజిపిడబ్ల్యుఎ ఎత్తి చూపింది.

డెలివరీ భాగస్వాములకు సామాజిక భద్రతతో పాటు ప్రోత్సాహకాలు కల్పించాలని, 10 నిమిషాల్లో డెలివరీ టార్గెట్ లాంటి పని ఒత్తిడిని తగ్గించాలనే డిమాండ్లతో ఇటీవల ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బెస్ట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మె చేపట్టాయి. డిసెంబర్ 25న, 31న రెండు రోజుల పాటు దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మె పిలుపునతో ఫుడ్ యాప్‌లకు ఝలక్ ఇచ్చిన విషయం తెలిసిందే. కొత్త సంవత్సరం ముందు రోజు భారీగా ఆర్డర్లు ఉండటంతో వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడొచ్చనే భయంతో ఆయా యాజమాన్యాలు గిగ్‌వర్కర్లకు స్వల్ప ప్రోత్సాహకాలు పెంచి తాత్కాలికంగా బయటపడ్డాయి. తాజాగా గిగ్‌వర్కర్లు మళ్లీ ఆందోళనకు సంకేతాలు ఇవ్వడం విశేషం.

వైద్య సేవలో నిర్లక్ష్యం వద్దు

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ విజయ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్య సేవలో డాక్టర్లు నిర్లక్ష్యం చేయకూడదని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ విజయ్ కుమార్ సూచించారు. శనివారం సంగారెడ్డి జిల్లా జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందోల్ నియోజకవర్గం జోగిపేట ప్రభుత్వ హాస్పిటల్‌లో అన్ని వసతులున్నా సంగారెడ్డికి ఎందుకు రిఫర్ చేస్తున్నారని ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించారు. సాధ్యమైనంతవరకు అన్ని కేసులను ఇక్కడే చికిత్స చేయాలని సూచించారు. ముఖ్యంగా నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలని, అనవసరంగా సిజేరియన్ శస్త్రచికిత్సలు చేయొద్దని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్యకు ఆదేశించారు. ఈ సందర్భంగా పురుషులు, మహిళల వార్డులు, డయాలసిస్ సెంటర్, అవుట్ పేషెంట్ విభాగంలో రోగుల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. డాక్టర్ల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన కమిషనర్, గైర్హాజరైన డాక్టర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఉన్న డాక్టర్లు స్టెథస్కోప్‌లు, ఆప్రాన్‌లు ధరించకుండా ఉంటే వారిని ఎలా గుర్తించగలమని ప్రశ్నించిన కమిషనర్, విధిగా స్టెథస్కోప్ ధరించాలని ఆదేశించారు. వార్డుల్లోకి వెళ్లి రోగులతో మాట్లాడిన ఆయన, ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాలు, డాక్టర్లు, సిబ్బంది సేవలు, ఆహార సరఫరా, ఇతర ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందుల కొరత ఏమైనా ఉంటే వెంటనే తెలియజేయాలని, మందుల కోసం రోగులను బయట కొనమని చెప్పరాదని స్పష్టం చేశారు. రోగులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అవసరమైతే ఆస్పత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగించుకోవచ్చని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

త్వరలో సదర్మాట్ బ్యారేజీ ప్రారంభోత్సవం

- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత త్వరలోనే ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నసదర్మాట్ బ్యారేజీని ప్రారంభోత్సవం చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని అన్నారు. శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఉత్తమ్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. చనాకా కొరాట ప్రాజెక్టుకు రూ.70 కోట్లు విడుదల చేశామని అన్నారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తామన్నారు. బిజెపి సభ్యుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ చనాకా కొరాట ప్రాజెక్టును 2017లోనే పూర్తి చేస్తామంటూ కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. భూమిని కోల్పోయిన బాధితులకు 2016లో పరిహారం ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటికీ ఇవ్వలేదని చెప్పారు. 200 మంది రైతులు పాదయాత్ర చేసుకుంటూ హైదరాబాద్ చేరకున్నారని వివరించారు. అసెంబ్లీకి వస్తుంటే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారని అన్నారు. ఆ రైతులకు పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2027లో పూర్తి చేస్తామంటూ ఈ ప్రభుత్వం ప్రకటించిందనీ, నిధులు విడుదల చేయాలని కోరారు. బిజెపి సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును పూర్తి చేయాలని సూచించారు.

అగాధంలోకి విద్యారంగం

- మతోన్మాద విధానాలతో అత్యంత ప్రమాదం
- నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటం
- ఎస్ఎఫ్ఐ జాతీయ కన్వెన్షన్‌లో విద్యార్థి సంఘం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ విద్యారంగంలో జాతీయ నూతన విద్యా విధానం-2020 అమలు చేయడం ద్వారా విద్యారంగం అగాధంలోకి వెళ్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో విద్యలో మతోన్మాదాన్ని అమలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను భాగం చేసి అసమానతలు పెంచుతోందన్నారు. ఎస్ఎఫ్ఐ జాతీయ కన్వెన్షన్ సందర్భంగా హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వరకు భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య మాట్లాడుతూ.. జాతీయ విద్యావిధానం దేశాన్ని అభివృద్ధి చేస్తుందని బిజెపి, ప్రదాని నరేంద్రమోడీ నమ్మించి మోసం చేశారన్నారు. ఆచరణలో దేశంలో లక్షకు పైగా పాఠశాలలు మూసేసి, లక్షకు పైగా టీచర్ పోస్టులను ఖాళీగా ఉంచిందన్నారు. మధ్యప్రదేశ్, హైదరాబాద్, కలకత్తా, ఢిల్లీ, చెన్నయ్ నగరాల్లో జాతీయ విద్యావిధానం - 2020కు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు.

కేంద్రం విధానాలతో తీవ్ర నష్టం : ఎం.సాజి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన విధానాలతో దేశానికి తీవ్ర నష్టం చేస్తోందని ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షులు ఆదర్శ్ ఎం.సాజి అన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రధాని మోడీ దేశాన్ని అంబానీ, అదానీకి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. వీటన్నింటికి వ్యతిరేకంగా విద్యార్థులను ఐక్యం చేయాల్సిన బాధ్యత ఎస్ఎఫ్ఐదే అని చెప్పారు.

ప్రజలను అభద్రతా భావంలోకి నెడుతున్న బిజెపి : టి.సాగర్

దేశంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను చేస్తూ ప్రజలను అభద్రతా భావంలోకి నెడుతున్నదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి టి.సాగర్ అన్నారు. ప్రజలు తిరగబడిన ప్రాంతాల్లో నిర్బంధం ప్రయోగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక వర్గంపై, ఉపాధి హామీ చట్టాన్ని మార్చి కార్మికులపై, యుజిసిని రద్దు చేసి విబిఎస్ బిల్లుతో విద్యారంగంపై దాడి చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర యూనివర్సిటీలకు నిధులు, విద్యార్థులకు ఫెలోషిప్స్ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు శిల్ప సురేంద్రన్ చెప్పారు. యూనివర్సిటీల్లో సౌకర్యాల్లేవని, వారు చెప్పిన అంశాలపై పరిశోధనలు చేయని వారికి ఫండ్స్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాల వల్ల అమ్మాయిలు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రీకరణ పేరుతో సెంట్రల్ యూనివర్సిటీలపై కేంద్రం దాడి చేస్తోందని ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి అతిక్ అహ్మద్ అన్నారు.

కేంద్రం విధానాలే రాష్ట్రంలోనూ అమలు : నాగరాజు

జాతీయ నూతన విద్యా విధానం-2020ను రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. పిఎంశ్రీ, తెలంగాణ ఫౌండేషన్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరుతో నూతన విద్యావిధానాన్ని పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ పేరుతో విద్యను కేంద్రీకరణ చేస్తున్నారని అన్నారు. ఎన్ఇపికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్ఇపి పోరాటానికి హైదరాబాద్ వేదిక కానుందని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె అశోక్‌రెడ్డి అన్నారు. ఈ సెమినార్ ద్వారా విద్యా రంగంలో మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందన్నారు. ఈ బహిరంగ సభలో ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి రోహిదాస్, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.మమత, బస్వరాజు, శివప్ప, సుజాత, మనీషా, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి కిరణ్, బి శంకర్, కె ప్రశాంత్, సహాయ కార్యదర్శి దీపిక, రంజిత్, శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా నాయకత్వం శ్రీమాన్, నాగేందర్, రజినీకాంత్, స్టాలిన్, రమ్య, సహాన, జె రమేష్, ప్రవీణ్, చరణశ్రీ, ప్రశాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆత్మగౌరవమే మా లక్ష్యం

- అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పేదలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో బతకడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగిస్తున్నామని అన్నారు. రాజకీయ పార్టీలు, వర్గాలకు అతీతంగా రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని వివరించారు. గృహజ్యోతి పథకం కోసం కొత్తగా అర్హత ఉన్న వారూ ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాపాలన అధికారులను కలిసి దరఖాస్తు చేయొచ్చని సూచించారు. పాతవారు వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.15 కోట్ల కుటుంబాలుంటే 52,82,498 కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయని వివరించారు. గృహజ్యోతి పథకం కింద ఇప్పటి వరకు రూ.3,593 కోట్లు ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్‌కు చెల్లించామని చెప్పారు.

కొత్త రేషన్‌కార్డు వచ్చిన వారికి వర్తింపజేయాలి మధుసూదన్‌రెడ్డి

గృహజ్యోతి పథకంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ సభ్యుడు జి.మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగా రేషన్‌కార్డులు తీసుకున్న వారికి, కిరాయి ఇంటి నుంచి సొంతింటికి మారిన వారికి ఈ పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గృహజ్యోతి వెబ్‌సైట్ 365 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దానం నాగేందర్ మాట్లాడుతూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో రెండు కోట్ల వరకు జనాభా ఉంటే గృహజ్యోతి లబ్ధిదారులు మాత్రం ఆరు లక్షల కుటుంబాలే ఉన్నాయని అన్నారు. పేదలకు కారు జీవనాధారంగా ఈ పథకం వర్తింపజేయడం లేదని చెప్పారు. గృహజ్యోతి పథకం పేదలకు ఎంతో ఉపయోగపడుతోందని కాంగ్రెస్ సభ్యులు నాగరాజు, ఆది శ్రీనివాస్ అన్నారు.

టూటైర్ నగరాలకు ఐటి విస్తరించండి

- మండలిలో ప్రభుత్వానికి పలువురు సభ్యుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐటిని టూటైర్ నగరాలకు విస్తరించాలని బిజెపి సభ్యులు ఎవిఎన్ రెడ్డి, బిఆర్ఎస్ సభ్యులు దాసోజు శ్రవణ్ కాంగ్రెస్ సభ్యులు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు శనివారం ప్రశ్నోత్తరాల సందర్భంగా శాసనమండలిలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో ఐటి రంగాన్ని కేంద్రీకృతం చేయడం వల్ల భవిష్యత్‌లో ప్రాంతీయ అసమానతలు తలెత్తుతాయని మలక్‌పేట ఐటి టవర్ నిలిపివేతపై జరిగిన చర్చ సందర్భంగా వారు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికతో ముందుకు పోతారని గుర్తు చేశారు. బిఆర్ఎస్ హయాంలో కరీంనగర్, సిద్దిపేట, నల్లగొండ, పట్టణాల్లో ఏర్పాటు చేసిన ఐటి టవర్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, బెంగుళూరు లాంటి నగరాల్లో పని చేసే ఐటి ఇంజనీర్లలో మెజార్టీ శాతం తెలంగాణ గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకులేనని వారు గుర్తు చేశారు. కంపెనీలకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇచ్చి తెలంగాణలో ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని కోరారు. ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ హైదరాబాద్ వెలుపల తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు ఐటి కంపెనీలు ముందుకు రావడం లేదని అన్నారు. సర్కార్ అభ్యర్థన మేరకు తమ కంపెనీలను ఏర్పాటు చేసినా అవి ఎక్కువ రోజులు ఉండడంలేదని చెప్పారు. వారికి కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పించడంతో పాటు ప్రత్యేక ప్రోత్సాహకాలిచ్చి రాష్ట్రంలోని టూటైర్ నగరాలకు ఐటి రంగాన్ని విస్తరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇ-వేలం అమ్మకపు ప్రకటన

IBC, 2016 మరియు ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డు ఆఫ్ ఇండియా (కార్పొరేట్ రుణగ్రహీతకు వ్యక్తిగత హామీదారుల కోసం దివాలా ప్రక్రియ) రెగ్యులేషన్స్, 2019 యొక్క రెగ్యులేషన్ 27 లోని షెడ్యూల్-2 యొక్క పార్ట్-ఎ క్రింద

శ్రీ తాడిశెట్టి నరసింహా రావు, శ్రీమతి తాడిశెట్టి వెంకట రమణ, శ్రీమతి తాడిశెట్టి అమల, శ్రీ జంజనం విద్యానాథ్ మరియు శ్రీ తాడిశెట్టి సుబ్బా రావు

M/s. ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ యొక్క (5 వ్యక్తిగత హామీదారుల కోసం దివాలా ప్రక్రియ)

బ్యాంక్రప్టసీ ట్రస్టీ శ్రీ కూరపాటి శింగరయ్య చౌదరి జారీ చేసిన వేలం నోటీసు

బ్యాంక్రప్టసీ ట్రస్టీ చిరునామా: ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, మాధాపూర్, హైదరాబాద్-500033, తెలంగాణ. ఇ-మెయిల్: pg.ethnictobacco@gmail.com

ఈ క్రింది ఆస్తులు పైన తెలిపిన వ్యక్తులకు చెందిన బ్యాంక్రప్టసీ ఎస్టేట్‌లో భాగమైన ఆస్తులు, బ్యాంక్రప్టసీ ట్రస్టీ ద్వారా **"ఎక్కడ ఎలా ఉన్నదో, "ఏది ఎలా ఉన్నదో" "ఏదైతే ఎలా ఉన్నదో అది అలానే" మరియు "ఎటువంటి రికోర్స్ లేని"** విధానంలో ఇ-వేలం ద్వారా దిగువ పట్టికలో పేర్కొన్న వివరాల ప్రకారం అమ్మకానికి ఉంచబడినవి.

ఆంధ్రప్రదేశ్, గుంటూరు నగరం మరియు చుట్టపక్కల ప్రాంతాలలో ఉన్న ఆస్తులు వాటి వివరాల కోసం దయచేసి వేలం ప్రక్రియ దాక్యుమెంట్‌ను చూడండి.

లాట్ నెం.	ఆస్తి వివరణ	రిజర్వు ధర (రూ.)	బయానా (రూ.)	బిడ్డు పెంపుదల మొత్తం (మల్టిపుల్స్‌లో) (రూ.)
1	గుంటూరు, అరుండల్‌పేట, కాకుమానివారితోట వద్ద 360 చ॥గ॥ల స్థలం మరియు 2700 చ॥అ॥ల విస్తీర్ణములో 2 బిహెచ్‌కె నివాస భవనము. **సేల్ డీడ్ నెం. 1103/1986. ఎస్ఆర్ఓ గుంటూరు.**	2,66,00,000	26,60,000	3,00,000
2	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 20 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 303. **సేల్ డీడ్ నెం. 96/2010. ఎస్ఆర్ఓ గుంటూరు.**	51,00,000	5,10,000	50,000
3	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 16.72 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 102. **సేల్ డీడ్ నెం. 13893/2007. ఎస్ఆర్ఓ గుంటూరు.**	51,00,000	5,10,000	50,000
4	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 20 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 103. **సేల్ డీడ్ నెం. 8291/2009. ఎస్ఆర్ఓ గుంటూరు.**	51,00,000	5,10,000	50,000
5	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్‌లో 24 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా & 1008 చ॥అ॥ల బిల్టప్ ఏరియా విస్తీర్ణముతో కూడిన ఫ్లాట్ నెం. 204. **సేల్ డీడ్ నెం. 8328/2009. ఎస్ఆర్ఓ గుంటూరు.**	51,00,000	5,10,000	50,000
6	గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మం॥, చౌడవరం వద్ద 2 ఎకరాల 63.5 సెంట్ల భూమి. **సేల్ డీడ్ నెం. 656/2007 & 720/2008. ఎస్ఆర్ఓ ప్రత్తిపాడు.**	2,74,37,000	27,43,700	3,00,000
7	గుంటూరు, అరుండల్‌పేట, జయా టవర్స్, 103 చ॥గ॥ల భూమి అవిభాజ్యవాటా కలిగి సెల్లార్‌లో 1140 చ॥అ॥ల షాపులు & గ్రౌండ్ ఫ్లోర్‌లో 2400 చ॥అ॥ల బిల్టప్ ఏరియాలోని షాపులతో కూడిన వాణిజ్య షాపులు 1 నుండి 10 వరకు మరియు సెల్లార్. **సేల్ డీడ్ నెం. 3058/2006. ఎస్ఆర్ఓ గుంటూరు.**	2,28,41,000	22,84,100	2,00,000
8	గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మం॥, నడింపాలెం వద్ద 10 ఎకరాల 36 సెంట్ల భూమి. **సేల్ డీడ్ నెంలు. 360/2008, 361/2008, 364/2008, 365/2008, 5828/2009, 5829/2009, 5830/2009, 5831/2009. ఎస్ఆర్ఓ ప్రత్తిపాడు.**	7,22,34,000	72,23,400	7,00,000
9	గుంటూరు జిల్లా, నల్లపాడుమం॥, పోతూరు గ్రా॥ వద్ద 1 ఎకరా 91 సెంట్ల భూమి. **సేల్‌డీడ్ నెంలు. 3466/2005, 3862/2005, 5523/2005, 5524/2005. ఎస్ఆర్ఓ నల్లపాడు.**	1,54,20,000	15,42,000	2,00,000
10	గుంటూరు, సంగడిగుంట వద్ద 999 చ॥గ॥ల భూమి. **సేల్ డీడ్ నెం. 8109/2007, 8110/2007. ఎస్ఆర్ఓ గుంటూరు.**	3,55,74,000	35,57,400	4,00,000
11	గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు మం॥, ఏదులపాలెం వద్ద 24200 చ॥గ॥లు (5 ఎకరాలలోని) వ్యవసాయేతర భూమి. **సేల్ డీడ్ నెం. 1424/2015. ఎస్ఆర్ఓ ప్రత్తిపాడు.**	1,98,46,000	19,84,600	2,00,000
12	గుంటూరు జిల్లా, తాడికొండ మం॥, లామ్ గ్రా॥ వద్ద 95 సెంట్ల భూమి. **సేల్ డీడ్ నెం. 1234/2007. ఎస్ఆర్ఓ తాడికొండ.**	1,47,45,000	14,74,500	1,00,000
13	గుంటూరు జిల్లా, నల్లపాడు మం॥, పోతూరు వద్ద 67 చ॥గ॥లలోని నివాస స్థలం. **సేల్ డీడ్ నెం. 4880/2010. ఎస్ఆర్ఓ నల్లపాడు.**	3,49,000	34,900	1,000

వేలం సమయ పట్టిక

ఆస్తి సందర్శన/ఆస్తి తనిఖీ	06.01.2026 నుండి 21.01.2026
అర్హత కలిగిన పత్రాల దాఖలు	23.01.2026
బయానా దాఖలు	23.01.2026
ఇ-వేలం తేది (బిడ్లు దాఖలు)	28.01.2026 న ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల మధ్య

సంక్షిప్త వేలం నియమనిబంధనలు:

1. ఆసక్తి గల దరఖాస్తుదారులు ఆన్‌లైన్ ఇ-వేలం నియమ నిబంధనల వివరాలు, ఇ-వేలం బిడ్డు ఫారం, అర్హత ప్రమాణాలు, బిడ్డర్ల డిక్లరేషన్, బయానా అవశ్యకతలు మొదలైన వివరాలు కలిగిన పూర్తి ఇ-వేలం ప్రాసెస్ ఇన్ఫర్మేషన్ డాక్యుమెంట్‌ను రిఫర్ చేయవలెను. సదరు డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్: https://bankauctions.in లో చూడవచ్చును లేదా ఇ-మెయిల్: pg.ethnictobacco@gmail.com ద్వారా పొందవచ్చును. బిడ్ సంబంధిత పత్రాలను నిర్దేశించిన ఫార్మాట్లలో ఇ-మెయిల్ ద్వారా సమర్పించాలి, తరువాత ఒరిజినల్ పత్రాలను సమర్పించాలి.
2. బయానా డిపాజిట్ చేసిన ఆసక్తి గల దరఖాస్తుదారుడు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను సృష్టించడంలో సహాయం కొరకు బ్యాంక్రప్టసీ ట్రస్టీ కార్యాలయాన్ని ఇ-మెయిల్ ద్వారా pg.ethnictobacco@gmail.com లేదా prakash@bankauctions.in మరియు ఫోన్ నెం. 8142000064 ను సంప్రదించవచ్చును.

కూరపాటి శింగరయ్య చౌదరి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
Reg. No. IBBI/IPA-003/IP-N000149/2017-2018/11728
pg.ethnictobacco@gmail.com

తేది: 4 జనవరి, 2026
ప్రదేశము: హైదరాబాద్

బాల పురస్కార్ గ్రహీత విశ్వనాథ్ కార్తికేయకు సత్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్

బాలపురస్కార్ గ్రహీత విశ్వనాథ్ కార్తికేయను రెసొనెన్స్ విద్యా సంస్థల ఎండి పూర్ణచంద్రరావు సత్కరించారు. 17 ఏళ్ల విశ్వనాథ్ జాతీయ స్థాయిలో అసాధారణ ప్రతిభ కనబర్చినందుకు 'సెవెన్ సమ్మిట్ ఛాలెంజ్'ను పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడిగా గుర్తింపు పొందినందకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇటీవల బాలపురస్కార్‌ను అందుకున్నారు. రెసొనెన్స్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విశ్వనాథ్‌కు ఆ విద్యా సంస్థ రూ.మూడు లక్షల నగదుతో పాటు సత్కారం ఏర్పాటు చేసింది.

విజయవంతంగా 54 ప్రినాటల్ డయాగ్నసిస్ పరీక్షలు

- టిఎస్‌సిఎస్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒక ముఖ్యమైన విజయంతో నూతన సంవత్సరాన్ని ప్రారంభించినట్లు తలసేమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టిఎస్‌సిఎస్) వెల్లడించింది. జన్యు రక్త రుగ్మతలను నిర్మూలించడానికి తాము చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో ఒక ప్రధాన మైలురాయిని సాధించినట్లు పేర్కొంది. మే 2025 నుంచి 2026 జనవరి 1 మధ్య, కమలా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో 54 ప్రినాటల్ డయాగ్నసిస్ (పిఎన్‌డి) పరీక్షలను టిఎస్‌సిఎస్ విజయవంతంగా నిర్వహించిందని ఆ సంస్థ పేర్కొంది. తలసేమియా, సికిల్ సెల్ అనీమియాకు సంబంధించి పిండం స్థితిని అంచనా వేయడానికి ఈ పరీక్షలు చాలా కీలకమైనవని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. తద్వారా ఈ తీవ్రమైన వ్యాధులతో బాధపడే పిల్లల జననాన్ని నివారించడానికి సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవచ్చున్నారు.

విద్యుత్ బిల్లులపై వినియోగదారుల ఫోన్ నెంబర్

- ఎస్‌పిడిసిఎల్‌లో అమలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) జనవరి 2026 నుంచి జారీ చేసే విద్యుత్ బిల్లులపై వినియోగదారుల మొబైల్ నెంబర్, ఈ మెయిల్ ఐడి వంటి వివరాలను కూడా ముద్రించనుంది. బిల్లుల్లో ముద్రించిన మొబైల్ నెంబర్ లేదా ఇతర వివరాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే, వినియోగదారులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం కల్పించింది. వినియోగదారులకు ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించేందుకు వీలుగా, విద్యుత్ బిల్లులపై సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్ (ఎఇ), అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఎడిఇ), అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎఎఒ) మొబైల్ నెంబర్లను సైతం ముద్రిస్తున్నారు. దీంతో పాటు "తెలంగాణ" అనే పదాన్ని కూడా ముద్రించనున్నామని సంస్థ సిఎండి ముషరఫ్ ఫరూఖీ తెలిపారు.

తప్పులు బయటపడ్తాయనే ప్రతిపక్ష నాయకుల వాకౌట్

- బీర్ల ఐలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్ష నాయకుల తప్పులు బయటపడ్తాయని వాకౌట్ చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు. అన్నీ దోచుకొని తోకముడుచుకొని పారిపోయారని, మాట్లాడటానికి సమయం ఇవ్వాలని బిఎసి సమావేశంలో అడిగారని చెప్పారు. మూసీ పునర్జీవనం చేద్దామని మంచి నిర్ణయం తీసుకుంటే చర్చకు రారన్నారు. కమీషన్ల కక్కుర్తితో 'పాలమూరు రంగారెడ్డి'ని ఎండబెట్టారని ఆరోపించారు. ధైర్యం ఉంటే అసెంబ్లీలో కృష్ణా జలాలపై, పాలమూరు రంగారెడ్డిపై చర్చకు రావాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం పేరు మార్చి, నిధులకు తూట్లు పొడుస్తుంటే కేంద్రంతో ఉన్న దోస్తానాతో బిఆర్‌ఎస్ చర్చలో పాల్గొన లేదని ఆరోపించారు. కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. కేంద్రం చేస్తున్న నష్టం బిఆర్‌ఎస్ పార్టీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబం పేరు చెబితేనే మోడీకి వణుకు పుడుతున్నదన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలి

- శాసనమండలి ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర శాసనమండలి శనివారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. శనివారం మధ్యాహ్నం శాసనమండలిలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విబి జి ఆర్‌ఎఎం జి చట్టాన్ని వెనక్కి తీసుకోవాలనీ, పాత చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆమె మాట్లాడుతూ కొత్త చట్టంతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుందని, గ్రామాల్లో పేదలకు ఉపాధి కరువై వలసలు పెరుగుతాయనీ, పని దినాలు తగ్గుతాయని వెట్టి చాకిరీ పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంత పేదల ఉపాధి కోసం చట్టం తీసుకురావాలని ఆమె కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

'పాలమూరు'ను పూర్తి చేయాలి..

- ప్రాజెక్టు నిర్మాణంలో కెసిఆర్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు
- కాంగ్రెస్ వ్యాఖ్యలు హాస్యాస్పదం
- జర్నలిస్టుల అక్రిడిటేషన్‌లో రెండు కార్డులు వద్దు : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఉమ్మడి జిల్లా వాసులకు నీరివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ సమావేశం డి.బాల్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న అనంతరం జాన్‌వెస్లీ మీడియాతో మాట్లాడుతూ.. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు వ్యయం రూ.74 వేల కోట్లలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ.32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి 90 శాతం పనులు పూర్తి చేశామని మాజీ సిఎం కెసిఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పెద్దపీట వేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెద్దపీట వేస్తే ప్రాజెక్టు పనులు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాలమూరు బీడు భూములకు సాగునీరు ఇవ్వడానికి ఈ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంపై అశాస్త్రీయ పద్ధతిలో మాట్లాడడం సరికాదన్నారు. ప్రధాన డిస్ట్రిబ్యూటర్లు, చిన్న కాల్వలు మొదలు కాలేదని, ప్రధాన కాలువలే పూర్తి చేయకుండా బీడు భూములకు నీళ్లు ఎలా పారుతాయని ప్రశ్నించారు. నిర్దిష్టమైన సమయం పెట్టుకుని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ విషయంలో రెండు కార్డుల విధానం సరికాదని, పాత విధానాలనే అమలు చేసి జర్నలిస్టుందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అసెంబ్లీ సమావేశంలో చర్చలకే పరిమితం కాకుండా కేంద్రంపై పోరాటాలకు సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని పిలవాలని కోరారు. పాలమూరు వంటి వలసల జిల్లా ఆకలిని తీర్చే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం నిర్వీర్యం చేసేందుకు వీబీజీరామ్‌జీ పేరిట కొత్త పథకాన్ని తెచ్చిందని విమర్శించారు.

ఈ బిల్లు ద్వారా చేసిన పనులకు 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జబ్బార్, ఎ లక్ష్మీ, జిఎస్ గోపి, పరమేశ్వరచారి, మేకల ఆంజనేయులు, మహబూబ్ పాషా, ఎం కృష్ణయ్య, బాల్యానాయక్, గుంటి వెంకటయ్య, ఆర్‌ఎన్ రమేష్, వెంకట్ రాములు ఉన్నారు.

కెజిబివిలో విద్యార్థిని మృతి

- ఆడుతూ స్పృహ కోల్పోయిన హర్షిత
- ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు ధ్రువీకరించిన వైద్యులు
- సిద్దిపేట జిల్లా మిట్టపల్లిలోని కెజిబివిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్కూల్‌లో ఆడుకుంటూ స్పృహ కోల్పోయి ప్రమాదవశాత్తు విద్యార్థిని మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా మిట్టపల్లి సమీపంలోని కెజిబివిలో శుక్రవారం రాత్రి జరిగింది. సిద్దిపేట త్రీ టౌన్ సిఐ విద్యాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన గుర్రం తిరుపతిరెడ్డి, శ్రావణి దంపతుల ఇద్దరు కుమార్తెలు.. మిట్టపల్లి సమీపంలోని కెజిబివిలో చదువుకుంటున్నారు. పెద్దమ్మాయి వర్ష 9వ తరగతి చదువుతుండగా, చిన్న కూతురు హర్షిత (11) ఏడవ తరగతి చదువుతోంది. కాగా, హర్షిత శుక్రవారం రాత్రి భోజనం చేసిన తర్వాత తోటి విద్యార్థులతో కలిసి ఆడుకుంటుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా స్పృహ తప్పి కింద పడిపోయింది. వెంటనే తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ప్రాథమిక చికిత్స నిర్వహించి అంబులెన్స్‌కు సమాచారం అందించి సమీపంలోని సురభి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు హర్షితను పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు.. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. అప్పటికే హర్షిత మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థి తండ్రి తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు సిఐ తెలిపారు.

అటవీశాఖలో ఎసిబి దాడులు

- రూ.3.51లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ..
- ఎఫ్‌డిఒ డివిజనల్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్తగూడెంలోని తెలంగాణ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్యాలయం (ఎఫ్‌డిఒ)లో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి కాంట్రాక్టర్‌ను లంచం అడిగినందుకు, మధ్యవర్తితో సహా ఇద్దరు ఫారెస్టు డెవలప్‌మెంట్ అధికారులపై కేసులు నమోదు చేసినట్టు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఎసిబి డిఎస్‌పి వై రమేష్ తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని ఎఫ్‌డిఒలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రుగొండ మండలం సీతాయిగూడెం సమీపంలో ఉన్న జామాయిల్ తోటలో కర్రను నరికేందుకు కాంట్రాక్టర్‌కు చెల్లించే బిల్లును శాంక్షన్ చేసేందుకు ఎఫ్‌డీఓ డివిజనల్ మేనేజర్ తాటి శ్రీ శ్రావణి, ప్లాంటేషన్ మేనేజర్ తాడి రాజేందర్ కాంట్రాక్టర్‌ను రూ.3.51లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఫారెస్టు పరిధిలోని జామాయిల్ తోటలో 32 వేల టన్నుల జామాయిల్ కర్ర నరికినందుకు గాను ఫారెస్టు శాఖ కాంట్రాక్టర్‌కు సుమారు రూ.రెండు కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులో లంచం కింద టన్నుకు రూ.150 చొప్పున చెల్లించాలని అధికారులు డిమాండ్ చేయగా.. రూ.90 చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. దీనిపై కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఈ క్రమంలో శనివారం సీతాయిగూడెం వద్ద లంచం ఇచ్చేందుకు అధికారులను కాంట్రాక్టర్ సంప్రదించగా వారు హైదరాబాద్ మీటింగ్‌కు వెళ్లామని, తమకు సంబంధించిన వ్యక్తిని మధ్యవర్తిగా పంపిస్తామని తెలిపారు. మధ్యవర్తిగా సూపర్‌వైజర్ కృష్ణయ్య రాగా, అతనికి కాంట్రాక్టర్ డబ్బులు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కృష్ణయ్యతోపాటు హైదరాబాద్ అటవీశాఖ సమావేశానికి వెళ్లిన ఎఫ్‌డీఓ డివిజనల్ మేనేజర్ తాటి శ్రీ శ్రావణి, ప్లాంటేషన్ మేనేజర్ తాడి రాజేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు డీఎస్పీ రమేష్ తెలిపారు.

దేశ తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

- ట్యాంక్ బండ్‌పై పూలే దంపతుల విగ్రహాలు
- క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

ప్రజాశక్తి -కల్చరల్

దేశ తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని, ఆమె జీవితం ఎందరో మహిళలకు స్ఫూర్తిదాయకమని పశుసంవర్థక, క్రీడా శాఖ మంత్రి వాటికి శ్రీహరి అన్నారు. సావిత్రిబాయి పూలే ఫౌండేషన్, సావిత్రిబాయి ఉమెన్ వెల్ఫేర్ సొసైటీ, సావిత్రిబాయి మహిళా సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో సావిత్రిబాయి 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావుతో కలిసి మంత్రి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సావిత్రిబాయి భర్త ప్రోత్సాహంతో చదువుకుని, భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆమె ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ట్యాంక్ బండ్‌పై పూలే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. నేడు వ్యవసాయ మార్కెట్లు చేయలేని పనులను మహిళలు చేస్తున్నారని తెలిపారు. రాబోవు రోజుల్లో మహిళలు చట్ట సభల్లో 33 శాతం ప్రజా ప్రతినిధులుగా ఉంటారని చెప్పారు.

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అంటరానితనానికి వ్యతిరేకంగా పూలే దంపతులు నిరంతరం పోరాటం చేశారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మాజీ ఎంపి వి హనుమంతరావు మాట్లాడుతూ.. సావిత్రిబాయి జయంతి రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం స్వాగతిస్తున్నానని తెలిపారు. అంబర్‌పేట్‌లో జ్యోతిరావు పూలే ఆడిటోరియం నిర్మించాలని కోరారు. ప్రతి జిల్లాలో సావిత్రిబాయి పూలే ప్రతిభా పాటవ పోటీలతోపాటు విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. మహిళా సంఘాలకు అండగా నిలబడి తక్కువ వడ్డీలకు రుణాలు అందించాలన్నారు.

కార్యక్రమంలో గందరగోళం

సావిత్రిబాయి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే ఫౌండేషన్, సావిత్రిబాయి ఉమెన్ వెల్ఫేర్ సొసైటీకి రూ.పది లక్షలు కేటాయించింది. ఇరు సంస్థలు సమన్వయంతో వేడుకలు జరపాలని ఉత్తర్వులు జారీ చేసింది.

కానీ రెండు సంస్థల మధ్య సమన్వయం లేకపోవడంతో ఒకే వేదికపై వేర్వేరుగా సభా కార్యక్రమాన్ని నిర్వహించడం గందరగోళానికి దారితీసింది. ప్రజా ప్రతినిధులు వేదికపై ఉన్న సమయంలో మాట్లాడటానికి మైక్ కోసం ఒకరికొకరు వాగ్వివాదం చేసుకోవడం కనిపించింది. ఈ సమన్వయ లోపంతో సభకు వచ్చినవారికి భోజన వసతి కూడా ఏర్పాటు చేయలేదు. విద్యార్థులకు మధ్యాహ్నం మూడు గంటల వరకు భోజనం లేకపోవడంతో ఆకలితో అలమటించారు.

ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించేదే తాత్వికత

- సావిత్రిబాయి జయంతి కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాత్వికత అంటే సమాజంలో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించడం అని సావిత్రిబాయి జయంతి కార్యక్రమంలో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ ముషీరాబాద్‌లోని ఎస్.ఆర్.శంకరన్ ఐఎఎస్ అకాడమీలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి, అలాగే అకాడమీ పదో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 'పూలే తాత్విక భావనలు' అన్న అంశంపై సెమినార్ జరిగింది. ఎస్ఆర్.శంకరన్ ఐఎఎస్ అకాడమీ ప్రిన్సిపల్ కె.సురేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.సతీష్ కుమార్ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎక్స్‌ఐఓఎఫ్ఎస్ కమర్షియల్ ట్యాక్సెస్ రిటైర్డ్ అడిషనల్ కమిషనర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రశ్నించినప్పుడే జ్ఞానం వస్తుందని, అలాంటి అంశాల్ని సావిత్రిబాయి పూలే, మహాత్మ జ్యోతిబాపూలే ఇద్దరూ కలిసి ఈ సమాజానికి ఒక సందేశంగా అందించారని కొనియాడారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. పూలే దంపతులు వారి సహచర్యంతో సమాజంలో వస్తున్న దురాచారాలపై పెద్దఎత్తున పోరాటం నిర్వహించారని తెలిపారు. ఈ వ్యవస్థలో మార్పు జరగాలంటే కచ్చితంగా విద్య అవసరమని, దానికి స్త్రీవిద్య అవసరం అనే దాన్ని ఎక్కువగా భావించి జ్యోతిబాపూలే తన భార్యని టీచరుగా తీర్చిదిద్దిన విషయాన్ని మర్చిపోరాదన్నారు. సావిత్రిబాయి పూలే సర్టిఫైడ్ టీచర్ అయిన తర్వాత మహారాష్ట్రతోపాటు మొత్తం భారతదేశం అంతా మహిళా అభ్యున్నతి కోసం, విద్య కోసం కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ శంకరన్ ఐఎఎస్ అకాడమీ ఆన్‌లైన్ కోర్స్ ఎడిటర్ కోట మురళీకృష్ణ, సిబ్బంది గాజర్ల రమ, సుమన్ దలోడ్, బి సంధ్యారాణి, అలివేలమ్మ, బి రంజిత్ కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల చలో అసెంబ్లీ

- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట, ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయించిన వారు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఆటో కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జెఎసి ఆధ్వర్యంలో శనివారం చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టింది. వందలాది మంది ఆటో డ్రైవర్లు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వద్ద నుంచి అసెంబ్లీ వైపు దూసుకెళ్తుండగా, పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో ఆటో డ్రైవర్లు రోడ్డుపై బైఠాయించగా పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి.వెంకటేశం (ఎఐటియుసి), నాయకులు ఎండి బాబా (సిఐటియు) మాట్లాడారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల అనేక మంది ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారని అన్నారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు కిలో మీటర్‌కు రూ.20, మినిమం చార్జి రూ.50కు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆటో డ్రైవర్‌కూ ఏడాదికి రూ.12 వేల సహాయం అందజేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్ నగరంలో అక్రమంగా తిరుగుతున్న ఓలా, ఉబెర్, ర్యాపిడో ద్విచక్ర వాహనాలను నిషేధించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కొత్త యాప్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జెఏసి రాష్ట్ర నాయకులు వేముల మారయ్య (బిఆర్‌టియు), ఎంఎ సలీం (తెలంగాణ జాగృతి), ఇ ప్రవీణ్ (టియుసిఐ), ఎ సత్తిరెడ్డి (టిడిఎస్), పి యాదగిరి (టిఎన్‌టియుసి), శివానందం (టిఎఎండియు), ఎస్ అశోక్, సిహెచ్ జంగయ్య, ఎం కృష్ణ, ఎం నరసింహ, శ్రీనివాస్, శ్యామ్ లాల్, మల్లికార్జున్ (ఎఐటియుసి), లింగం గౌడ్ (టియుసిఐ) తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన కారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆదర్శమూర్తి సావిత్రిబాయి

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ
- టిపిఎస్‌కె ఆధ్వర్యంలో సావిత్రిబాయి 195వ జయంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మనుస్మృతి చీకట్లు.. పెత్తందారుల ఆధిపత్యం శూద్రులపై కొనసాగుతున్న తరుణంలో చదువు వెలుగులు అందించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి అని జాతీయ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. టిపిఎస్‌కె ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం సావిత్రిబాయి పూలే 195వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్షరాలను నేర్పి ప్రజలను ఆయుధాలుగా మలిచిన మాతృ మూర్తి పూలే అన్నారు. మహిళలకు జ్ఞానాన్ని పంచి సుజ్ఞానిగా నిలిచిన తల్లి సావిత్రిబాయి అని కొనియాడారు. బహుజనులను కూడదీసి భారతీయులను ఒకటి చేసిన అతి శూద్రుల సరస్వతి సావిత్రిబాయి అని చెప్పారు. టిపిఎస్‌కె రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జి.రాములు మాట్లాడుతూ.. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుందని, కుటుంబం మారాలంటే స్త్రీలు చదువుకోవాలంటూ సావిత్రిబాయి 1848లో మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించినట్లు చెప్పారు. తొలి మహిళా టీచర్‌గా ఆమె ఎన్నో కష్టాలు పడ్డారని, అయినా బెదరకుండా 36 పాఠశాలలను స్థాపించి దేశంలోనే మహిళా అభ్యున్నతికి కృషి చేసిన తొలి మహిళ సావిత్రిబాయి అని అన్నారు. ఈనాడు రాజ్యాంగం అందరికీ చదువు హక్కు కల్పించిందంటే అది ఆమె చేసిన పోరాటం అని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చదువు, జ్ఞానం ఈ దేశ ప్రజల మెదళ్లలో మిగిలినంతకాలం సావిత్రిబాయి త్యాగానికి ఈ దేశం రుణపడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు బుచ్చిరెడ్డి, బాలోత్సవం రాష్ట్ర కార్యదర్శి సోమయ్య, కె ఇందిర, రజిత తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ప్రమాదంపై దర్యాప్తు

- డ్రైవర్ ఆళ్ల నవీన్,పాఠశాల యజమాని దేశిరెడ్డి నాగేందర్ రెడ్డి పై రేసు
- నలుగురు విద్యార్థుల పరిస్థితి సీరియస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా వేంసూరు మండలం మొద్దులగూడెం వివేకానంద విద్యాలయం ప్రయివేట్ పాఠశాల బస్సు శుక్రవారం సాయంత్రం అదుపుతప్పి కాలువలో పడిన ఘటన తెలిసిందే. కాగా, ఈ సంఘటనలో 20 మంది విద్యార్థులకు గాయాలు కాగా, వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం, విజయవాడ తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారుకులైన బస్సు డ్రైవర్ నవీన్ ఏ-1గా, పాఠశాల యజమాని నాగేందర్ రెడ్డిని ఏ-2గా పేర్కొంటూ పెనుబల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు ఫిట్‌నెస్, కెపాసిటీకి మించి 107 మంది విద్యార్థులను ఎక్కించటం తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తులు తమ రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని కేసులు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రస్థాయి బిజెపి నాయకుని సహకారం, జిల్లాకు చెందిన ఓ మంత్రి ద్వారా స్థానిక మండల నాయకులు కేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు ప్రచారం. ప్రమాదం జరిగి 24 గంటలు గడుస్తున్నప్పటికీ గాయాలైన పిల్లల పరిస్థితి ఏ విధంగా ఉన్నదనే అంశాన్ని బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచటం పలు అనుమానాలకు దారి తీస్తోంది. డిఇఒ ఆదేశాలు మేరకు స్థానిక ఎంఇఒ సిహెచ్ వెంకటేశ్వరరావు శనివారం పాఠశాలలో విచారణ చేశారు. సత్తుపల్లి ఆర్టీవో ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు సమాచారం. గతంలో ఈ పాఠశాల బస్సులు అనేకచోట్ల ప్రమాదాలకు గురయినట్టు స్థానికులు అంటున్నారు. ప్రమాదానికి కారణమైన పాఠశాల యజమాన్యంపై కఠినంగా చర్యలు తీసుకొని, గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సావిత్రి భాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లు లక్ష్మి

మహిళా అభ్యున్నతికి మార్గదర్శి సావిత్రి బాయి పూలే

- మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి సావిత్రి బాయి పూలే అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కొనియాడారు. శనివారం హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో సావిత్రి బాయి పూలే 195వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.ఎన్.ఆశాలత, నాయకులు కవిత, జ్యోతి, పద్మ, మంజుల తదితరులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ వైదిక ధర్మాల్లో అంతరాగేంగా ఉన్న బ్రాహ్మణీయ సంప్రదాయాలు, ధర్మశాస్త్రాలు మహిళలు చదువుకోవటాన్ని నిషేధించాయని తెలిపారు. ఆ కాలంలో స్త్రీలు చదువుకుంటే కుటుంబం, సమాజాం అభివృద్ధి చెందుతాయని, వారికి విద్య నేర్పించడంలో సావిత్రి బాయి పూలే చేసిన కృషి అమోఘమని తెలిపారు. 1848లో బాలికల కోసం పుణెలో మొదటి పాఠశాలను ప్రారంభించిన ఆమె స్త్రీ విద్యకు బాటలు వేసిన మార్గదర్శి అని గుర్తుచేశారు. సామాజిక విప్లవకారిణిగా 1873 సెప్టెంబర్ 24న సత్యశోధ సామాజిక ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి ఆ సంస్థ ద్వారా మహిళల సాధికతారత, సంక్షేమం కోసం కృషి చేశారని చెప్పారు. ఎందరో చరిత్రకారులు ఆమె చేసిన కృషిని గుర్తించారని తెలిపారు. క్షురకులు వితంతువులకు శిరోముండనం చేయొద్దంటూ తిరుగుబాటు చేసేలా వారిని చైతన్యవంతులను చేయటంలో సావిత్రిబాయి పూలే ముఖ్య భూమిక పోషించారన్నారు. పుణెలో 1896లో కరువు సంభవించినప్పుడు సావిత్రి బాయి పూలే అవిశ్రాంతంగా పని చేసి బాధితులను ఆదుకోవడంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సహాయ కార్యక్రమాలు, నిధులను మంజూరు చేయించారని కొనియాడారు. పుణెలో అంటువ్యాధులు ప్రజలకు సోకిన సయమంలో రోగులకు రాత్రింబవళ్లు సేవ చేసిన ఆదర్శమూర్తి సావిత్రి బాయి పూలే అని అన్నారు. ఆమె ఆచరించిన సామాజిక, సాంఘిక పోరాటాలకు పూనుకోవటమే ఆమెకిచ్చే నిజమైన నివాళి అని మల్లు లక్ష్మి తెలిపారు.